క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ : పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతులు కారణంగా బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏడీ శంకర్ తెలిపారు. శివాజీనగర్, ఎన్జీ కాలనీ, క్లాక్ టవర్, రామగిరి రోడ్డు, కనకదుర్గ స్ట్రీట్, శ్రీనివాస్‌నగర్, గాంధీనగర్, పరిసర ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సీపీఎం సీనియర్ నాయకుడు మృతి

కేతేపల్లి : మండలంలోని చీకటిగూడెం గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు వెంబడి బాలనర్సయ్య(88) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. బాలనర్సయ్య మృతదేహాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందాల ప్రమీల, బోళ్ళ నర్సింహారెడ్డి సందర్శించి నివాళులర్పించారు. వారి వెంట సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు, మండల కార్యదర్శి సీహెచ్.లూర్ధుమారయ్య, కోట లింగయ్య, సీహెచ్.నాగయ్య, వెంబడి లింగయ్య, సాదె నాగయ్య, యాదయ్య, వడ్డె నారాయణ, ఏసు తదితరులు ఉన్నారు.

నిజాయితీ చాటుకున్న డిగ్రీ కళాశాల లెక్చరర్


డబ్బులు అందజేస్తున్న లెక్చరర్ హబీబ్ జానీ

నకిరేకల్ : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్న హబీబ్ జానీ తన బ్యాంక్ అకౌంట్‌లోకి పొరపాటున బదిలీ అయిన రూ.50వేలను మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించి నిజాయితీ చాటుకున్నాడు. వివరాలు..జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలం నమిలిగొండ గ్రామానికి చెందిన పురువుని ఐలోని ఈ నెల 8వ తేదీన రూ.50వేలు ఫోన్ పే చేయబోయి ఒక అంకె తప్పుగా నమోదు చేయడంతో ఆ డబ్బులు లెక్చరర్ హబీబ్ జానీ ఫోన్ పే నంబర్‌కు వచ్చాయి. ఐలోని వెంటనే హబీబ్ జానీకి ఫోన్ చేసి విషయం చెప్పడంతో మంగళవారం నకిరేకల్ పోలీస్ స్టేషన్‌లో పోలీసుల సమక్షంలో ఐలోనికి హబీబ్ జానీ రూ.45వేలు ఫోన్ పే రూపంలో.. మరో రూ.5వేలు క్యాష్ రూపంలో అందజేశారు.

నేడు ముదిరాజ్ కులస్తుల సమావేశం

నల్లగొండ టౌన్ : ముదిరాజ్ సంఘం జిల్లా ముఖ్య నాయకుల సమావేశం బుధవారం స్థానిక చినవెంకట్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు ముదిరాజ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నల్ల సోమమల్లయ్య తెలిపారు. మంగళవారం స్థానికంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో పందిరి శ్రీనివాస్‌ముదిరాజ్, కావలి ఆంజనేయులు, ఈటెల వెంకటేశ్వర్లు, నారబోయిన రవిముదిరాజ్, బోళ్ల వెంకట్‌ముదిరాజ్, లోకనబోయిన రమణముదిరాజ్, నాశబోయిన వెంకటేశ్వర్లు, సంగెపు సురేష్, కట్టా సుధాకర్‌ముదిరాజ్, పందిరి దినేష్, తలారి యాదగిరి ముదిరాజ్ పాల్గొన్నారు.


బ్రేక్‌ఫాస్ట్ పథకం పరిశీలన


అల్పాహారాన్ని వడ్డిస్తున్న డీఈఓ భిక్షపతి

చండూరు : చండూరు మండలం బంగారిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని డీఈఓ భిక్షపతి మంగళవారం పరిశీలించారు. ఆయన స్వయంగా విద్యార్థులకు టమాట బాత్ టిఫిన్‌ను వడ్డించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ పథకం అమలులో నిర్లక్ష్యం వహించొద్దన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు రామలింగయ్య, అంగన్‌వాడీ వర్కర్లు ఉన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

నకిరేకల్ : సోనియా గాంధీ ప్రకటించిన ఆరు గ్యారెంటీ స్కీంలతో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీ గాజుల సుకన్య అన్నారు. నకిరేకల్ మున్సిపాలిటీలోని 15, 16వ వార్డుల్లో గడపగడపకు ఆరు గ్యారెంటీ స్కీంల కరపత్రాలను మంగళవారం ఆమె పంపిణీ చేసి మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ మాజీ సర్పంచ్ పన్నాల రంగమ్మ, 15వ వార్డు కౌన్సిలర్ యాసారపు లక్ష్మీ వెంకన్న, నాయకులు బండగొర్ల సుజాత, దికొండ ధనమ్మ, సుచరిత తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలను పంపిణీ చేస్తున్న గాజుల సుకన్య

శిథిలావస్థలో పోలీస్ క్వార్టర్లు

- పెచ్చులూడుతున్న పైకప్పు
- ఇబ్బందులు పడుతున్న పోలీసుల కుటుంబాలు
- నూతన గృహాలు నిర్మించాలని రెండేళ్ల క్రితం ప్రతిపాదనలు
- స్పందించని ఉన్నతాధికారులు


పెచ్చులూడిపోయిన పోలీస్ క్వార్టర్స్ గోడలు


పోలీస్ క్వార్టర్స్ గోడల దుస్థితి

చిట్యాల : జాతీయ రహదారి పక్కన చిట్యాల పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో నిర్మించిన పోలీస్ క్వార్టర్లు (నివాస గృహాలు) శిథిలావస్థకు చేరాయి. ఇరవై ఏళ్ల క్రితం సిమెంట్ ఇటుకలతో మూడు అంతస్తుల్లో పది డబుల్ బెడ్‌రూంలతో రెండు బిల్డింగ్‌లను పోలీస్ సిబ్బంది నివాస గృహాల కోసం నిర్మించారు. తగిన నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో క్వార్టర్ల గోడలు పెచ్చులూడిపోయి, పైకప్పు సీకులు తేలి, ప్రహరీ గోడలు కూలిపోయి ప్రమాదకర స్థితిలో ఉన్నాయి. క్వార్టర్స్‌కు నీటి సరఫరా చేసే పైపులైన్ తరచూ మరమ్మతులకు గురవుతుండడంతో పోలీసు కుటుంబాలు అప్పుడప్పుడు ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా క్వార్టర్స్ గోడల పెచ్చులూడిపోయి మీద పడుతున్నాయి. దీంతో చిన్నపిల్లలతో నివసించే పోలీసు కుటుంబాలు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. కాగా నాలుగు క్వార్టర్స్ అతి ప్రమాదకరంగా ఉండడంతో వినియోగించడం లేదు. దూర ప్రాంతాల నుంచి బదిలీపై వచ్చిన పోలీసుల కుటుంబాలు తప్పనిసరి పరిస్థితుల్లో క్వార్టర్స్‌లో భయంభయంగా నివాసం ఉంటున్నాయి. కాగా మరికొందరు పోలీసు సిబ్బంది చిట్యాల పట్టణంలో అద్దె గృహాల్లో నివసిస్తున్నారు. ఈ క్వార్టర్స్‌ను కూలగొట్టి అధునాతన క్వార్టర్స్ నిర్మించాలని పోలీసు శాఖ అధికారులు రెండేళ్ల క్రితమే ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు. కానీ ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు.

శిథిలావస్థలకు చేరిన ఎస్‌ఐ నివాస గృహం

స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలోనే ఎస్‌ఐ కుటుంబం నివాసం కోసం ప్రత్యేక డబుల్ బెడ్ రూం పదేళ్ల క్రితం నిర్మించారు. ఈ క్వార్టర్ నిర్మించిన కొద్ది రోజులకే అందులో నివాసం ఉన్న ఓ ఎస్‌ఐ సర్వీస్ రివాల్వర్‌తో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో అప్పటి నుంచి ఈ క్వార్టర్ ఖాళీగా ఉంటోంది. ఇటీవల ఈ క్వార్టర్‌లో పోలీసు తనిఖీల్లో లభ్యమైన పీడీయస్ బియ్యం, వడ్లు వంటి సామగ్రి ఉంచారు. ప్రస్తుతం ఆ క్వార్టర్ కూడా శిథిలావస్థకు చేరుకుంది. ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకుని ప్రస్తుతం క్వార్టర్లకు మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా నూతన క్వార్టర్లు నిర్మించాలని పోలీసు సిబ్బంది కోరుతున్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థికి ఏసీపీ చేయూత


ప్రవీణ్‌ను అభినందిస్తున్న ఏసీపీ కందుల సత్యనారాయణ

కేతేపల్లి : నిరుపేద ఎంబీబీఎస్ విద్యార్థి చదువు కోసం ఆర్థిక సహాయం అందజేసి ఉదారత చాటుకున్నాడు కేతేపల్లి మండలంలోని కాసనగోడు గ్రామానికి చెందిన పోలీసు అధికారి కందుల సత్యనారాయణ. కాసనగోడు గ్రామానికి చెందిన బాదిని భిక్షం చిన్న కుమారుడు ప్రవీణ్‌కుమార్‌కు ఎంబీబీఎస్‌లో సీటు వచ్చింది. ప్రవీణ్ కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. దీంతో కుటుంబ సభ్యులు మాజీ ఎంపీటీసీ కందుల మోహన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఏసీపీగా పనిచేస్తున్న సత్యనారాయణను కలిసి పరిస్థితి వివరించారు. ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన ప్రవీణ్‌ను ఏసీపీ సత్యనారాయణ అభినందించి రూ.20వేల ఆర్థిక సహాయం అందజేశారు.

బహుజన బతుకమ్మ పోస్టర్ ఆవిష్కరణ

నాంపల్లి : ఈ నెల 13న నిర్వహించనున్న బహుజన బతుకమ్మను జయప్రదం చేయాలని తెలంగాణ అమరవీరుల ఆశయాల సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోరె సాయిరాం కోరారు. కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను మంగళవారం మండల కేంద్రంలో ఆయన విడుదల చేసి మాట్లాడారు. ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బుషిపాక శాంతకుమార్, డోల్‌దెబ్బ మండల అధ్యక్షుడు పన్నాల మల్లయ్య, ఏదుళ్ళ సైదులు తదితరులు పాల్గొన్నారు.

మహా పాదయాత్ర పోస్టర్ విడుదల

నకిరేకల్ : నవంబర్ 7వ తేదీన అలంపూర్ నుంచి హైదరాబాద్ వరకు నిర్వహించనున్న మాదిగల విశ్వరూప మహా పాదయాత్ర ప్రచార పోస్టర్‌ను నకిరేకల్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు మంగళవారం విడుదల చేశారు. కందికంటి అంజయ్య, నరసన్న, వంటల ఆనంద్‌బాబు, వంటల వెంకటేశ్వర్లు, వెంకన్న, బొజ్జ వేణుగోపాల్, గుండ్లపల్లి నాగరాజు, చిట్టిపాక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్ వాసికి డాక్టరేట్


పైళ్ల సుభాషిణిరెడ్డి

నకిరేకల్: పట్టణానికి చెందిన విద్యావేత్త పైళ్ల సుభాషిణి రెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతిలోని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం నుంచి డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్‌లో డాక్టరేట్ పొందారు. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ టంగుటూరి శిరీషా పర్యవేక్షణలో 'ఎడ్యుకేషనల్ డిపార్ట్‌మెంట్‌లో 8, 9వ తరగతి విద్యార్థుల్లో అచీవ్‌మెంట్ సంబంధించిన గణితం సబ్జెక్ట్ ఓరియెంటెడ్ శిక్షణ' అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను ఆమెకు డాక్టరేట్ ప్రదానం చేశారు. సుభాషిణిరెడ్డి నకిరేకల్‌లోని ఏవీఎం బీఈడీ కళాశాలలో గతంలో 20 సంవత్సరాలు గణితం, సైకాలజీ అధ్యాపకురాలిగా, ప్రిన్సిపాల్‌గా పనిచేశారు.

కలెక్టర్‌కు వినతి

నల్లగొండ టౌన్ : ప్రభుత్వ భూములు కలిగి రుణమాఫీ అయిన రైతులందరికీ తిరిగి పంట రుణాలు ఇవ్వాలని కోరుతూ మంగళవారం కలెక్టర్ కర్ణన్‌కు సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, బండా శ్రీశైలం వినతిపత్రం అందజేశారు. లక్ష లోపు ఉన్న రుణాలన్నింటినీ మాఫీ చేయాలని కోరారు. వారి వెంట వెంకటేశ్వర్లు, సయ్యద్‌హాషం, నాగిరెడ్డి, ప్రమీల, నరసింహ, అశోక్‌రెడ్డి, ధనంజయ్‌గౌడ్, స్వామి ఉన్నారు.

కేసు నమోదు

మర్రిగూడ : మండల పరిధిలోని సరంపేటతండాలో వ్యవసాయ పొలంలో నాటుసారా తయారు చేస్తున్న రమావత్ పంతునాయక్‌ను పక్కా సమాచారం మేరకు మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ కె.రంగారెడ్డి తెలిపారు. పంతునాయక్ తన పొలంలో తయారు చేసిన 5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

తప్పుడు ప్రచారాలను ఖండించాలి


మాట్లాడుతున్న చలమల్ల కృష్ణారెడ్డి

చౌటుప్పల్: పొత్తులో భాగంగా మునుగోడు నియోజకవర్గాన్ని సీపీఐకి కేటాయించారని, తమ పార్టీకి చెందిన కొంతమంది నేతలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, వీటిని జిల్లాకు చెందిన పార్టీ ముఖ్యనాయకులు ఖండించాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి చలమల్ల కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం చౌటుప్పల్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పొత్తుల విషయంలో ఇంకా ఎలాంటి స్పష్టత లేదన్నారు. మునుగోడు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా తానే పోటీ చేస్తున్నానని తెలిపారు. మునుగోడులో సీపీఐ నేతలు తనపై సైతం సానుభూతితో ఉన్నారని తెలిపారు. విజయం సాధించేది తానేనన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సొంత పార్టీ కార్యకర్తలకు దోచిపెట్టిన బీఆర్ఎస్ నాయకులను గ్రామాలకు రాకుండా తరిమికొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రిటర్నింగ్ అధికారి వద్ద అనుమతులు పొందిన తర్వాత ప్రజా చైతన్య యాత్రను యథావిధిగా నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో బ్లాక్, పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనారెడ్డి, సుర్వి నర్సింహగౌడ్, బోయ దేవేందర్, నాయకులు గూడూరు వెంకట్‌రెడ్డి, ఖయ్యూం, బత్తుల శ్రీహరి, కేతరాజు అచ్చయ్య, ఏదుళ్ల అరవింద్‌రెడ్డి, దోర్నాల శ్రీనివాస్, తీగుళ్ల చంద్రయ్య, రాచకొండ భార్గవ్, బాలం అండాలు, డిల్లీ చంద్రకళ, అబ్బాస్‌బేగం, పెద్దగోని రమేష్, లగ్గోని వెంకటేశం, వసీం, చరణ్ తదితరులున్నారు.

అధిష్టానం పునరాలోచన చేయాలి


నకిరేకల్ : మాట్లాడుతున్న దైద రవీందర్

నకిరేకల్ : అధిష్టానం పునరాలోచన చేసి తన సేవలను గుర్తించి కాంగ్రెస్ పార్టీ నకిరేకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను ప్రకటించాలని కాంగ్రెస్ నేత దైద రవీందర్ కోరారు. నకిరేకల్ మండలం పాలెం గ్రామంలో మంగళవారం జరిగిన కాంగ్రెస్ పార్టీ ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త వారిని తీసుకొచ్చి ఈయనే మీ అభ్యర్థి అని ప్రకటిస్తే ఐదేళ్లుగా పార్టీ కోసం పనిచేసిన వారు ఎటుపోవాలని ప్రశ్నించారు. ఈ సమావేశంలో గార్లపాటి రవీందర్‌రెడ్డి, చింత పున్నయ్య, పందులు నాగరాజు, ఆవుల వేణు, మాచర్ల శేఖర్, కల్లేపల్లి ఇస్తారి, భాగ్యరాజు, నరేష్ పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో విజయం సాధిస్తా

కేతేపల్లి : కాంగ్రెస్ పార్టీ అధిష్టానం తనను నకిరేకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటిస్తే భారీ మెజార్టీతో విజయం సాధిస్తానని టీపీసీసీ మాజీ కార్యదర్శి దైద రవీందర్ అన్నారు. మంగళవారం మండలంలోని కొర్లపహాడ్ గ్రామంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వే పేరుతో ఓడిపోయిన వ్యక్తిని పార్టీలోకి తీసుకురావడం సరైంది కాదన్నారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ కుమ్మరి నాగయ్య, సోమిరెడ్డి, ఉపేందర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, నర్సింహ, అంజయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని ధర్నా


ధర్నా చేస్తున్న ఉద్యోగి

మర్రిగూడ : మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో 11 ఏళ్లుగా పనిచేస్తున్న క్లర్క్ మల్లికార్జున్ తనకు చైర్మన్ వేతనం చెల్లించడం లేదంటూ సహకార సంఘం ఎదుట మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి ధర్నా చేపట్టాడు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ గత ఏడాది ఎనిమిది నెలల వేతనం చెల్లించలేని, ఈ ఏడాది కూడా తనతోపాటు పనిచేస్తున్న కార్యాలయ సీఈఓ శ్రీనివాస్, సిబ్బంది సందీప్, పరమేష్, స్వీపర్ శంకరమ్మలకు కూడా ఐదు నెలల వేతనాలు అందించలేదని వాపోయాడు. చైర్మన్ స్పందించి తమకు వేతనాలు అందించేవిధంగా చొరవ చూపాలని కోరారు. ఈ విషయమై సీఈఓ శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. మూడు నెలల వేతనాలు చెల్లించడానికి సంఘంలో నిధులు ఉన్నాయని, చైర్మన్ సంతకం కాగానే జీతాలు అందజేస్తామని తెలిపారు.

మళ్లీ మొదలైన అక్రమ కట్టడాలు


డ్రెయినేజీపై ఇటీవల నిర్మించిన మరుగుదొడ్డి

మునుగోడు : మండల కేంద్రంలోని ప్రధాన దుకాణాల సముదాయం వెనుక భాగంలోని డ్రెయినేజీపై అక్రమ కట్టడాలు మళ్లీ మొదలయ్యాయి. దుకాణాల వెనుకభాగంలో 30 ఏళ్ల క్రితం 12 ఫీట్ల రహదారితోపాటు గ్రామంలోని ప్రజలు వినియోగించిన మురుగు గ్రామశివారులోని వాగులోకి పంపేందుకు 4 ఫీట్ల వెడల్పుతో డ్రెయినేజీ నిర్మాణం చేపట్టారు. అయితే దుకాణాల యజమానులు ఆ రహదారితోపాటు మురికి కాల్వను కబ్జా చేయడంతో ఆ దారే కనుమరుగైపోయింది. దీంతో పలు సంఘాల నాయకులు, మునుగోడు గ్రామ ప్రజలు కబ్జాలను స్వాధీనం చేసుకుని గతంలో వలె డ్రెయినేజీ నిర్మాణంతోపాటు రహదారిని ఏర్పాటు చేయాలని ఆందోళనలు చేపట్టారు. అధికారులు స్పందించి ఏడాది క్రితం కొందరి అక్రమ కట్టడాలు తొలగించారు. ఇటీవల రూ.30 లక్షల వ్యయంతో డ్రెయినేజీ పునర్నిర్మించి దారి మొత్తం సీసీ రోడ్డు వేశారు. అది పూర్తయి నెల రోజులు కాకముందే తిరిగి ఆ కాల్వపై అక్రమ నిర్మాణాలు మొదలు పెట్టారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నేతల విగ్రహాలకు ముసుగు


నెహ్రూ విగ్రహానికి ముసుగు వేస్తున్న మున్సిపల్ సిబ్బంది


మాధవరెడ్డి విగ్రహానికి ముసుగు వేస్తున్న సిబ్బంది


గుండగోని మైసయ్య విగ్రహానికి..


రామగిరిలోని చకిలం శ్రీనివాసరావు విగ్రహానికి..

రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో జిల్లా అధికారులు ఎన్నికల నియమావళి అమలుపై దృష్టి సారించారు. జిల్లా కేంద్రంలోని పలు పార్టీల నాయకుల విగ్రహాలకు మంగళవారం సంబంధిత శాఖ సిబ్బంది ముసుగు వేశారు. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

ప్లాట్లు చూపించాలని కొనుగోలుదారుల ఆందోళన



ఆందోళన చేస్తున్న బాధితులు

నల్లగొండ టూటౌన్ : తాము కొనుగోలు చేసిన ప్లాట్లు చూపించాలని డిమాండ్ చేస్తూ బాధితులు మంగళవారం నల్లగొండ పట్టణంలోని ప్రకాశం బజారులో వెంచర్ యజమానికి చెందిన దుకాణం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పలువురు బాధితులు మాట్లాడుతూ మునుగోడు రోడ్‌లో 20 ఏళ్ల కిందట ప్లాట్లు కొనుగోలు చేశామని, తమకు రిజిస్ట్రేషన్ చేసిన ప్లాట్లు దేవుడి మాన్యం భూమి అని తేలడంతో తమను అక్కడికి రానివ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బొబ్బలి దామోదర్ రెడ్డి, జగమోహన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డితోపాటు మరో ఇద్దరు కలిసి ప్లాట్లు విక్రయించారని తెలిపారు. తమను మోసం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకన్న, లింగయ్య, శ్రీనివాస్, యాదగిరి, శేఖర్, వెంకట్‌రెడ్డి, ముస్తాఫా, నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీలు ముమ్మరం


నకిరేకల్ : బాబాసాహెబ్‌గూడెం వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు


నకిరేకల్ : శాసన సభ ఎన్నికల కోడ్ రావడంతో పోలీస్ యంత్రాంగం తనిఖీలను ముమ్మరం చేసింది. నకిరేకల్ సీఐ రాజశేఖర్, ఎస్‌ఐలు గోపీకృష్ణ, సుధీర్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం నకిరేకల్ శివారులోని బాబాసాహెబ్‌గూడెం వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ రాజశేఖర్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉన్నందున ఎవరైనా రూ.50 వేలకు మించి డబ్బులు తీసుకెళ్లకూడదన్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో అయితే అధికారుల నుంచి అనుమతి తీసుకుని సంబంధిత పత్రాలు సమర్పించాలన్నారు. ఎలాంటి పత్రాలు లేకుండా డబ్బు రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

శాలిగౌరారం మండలంలో..

శాలిగౌరారం : రాష్ట్రంలో ఎన్నికల నియమావళి అమలులోకి రావడంతో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. అందులో భాగంగానే మంగళవారం మండలంలోని వంగమర్తి సమీపంలో 365వ నంబర్ జాతీయ రహదారిపై ఎస్‌ఐ సతీష్ నేతృత్వంలో వాహనాల తనిఖీ చేశారు. జనగాం పట్టణానికి చెందిన పత్తి వ్యాపారి కోలగాని శ్రీనివాస్ కారులో అర్వపల్లి వైపు నుంచి నకిరేకల్ వైపు వెళ్తుండగా కారును తనిఖీ చేశారు. కారులో రూ.లక్ష నగదు ఉండగా సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. సాయంత్రం శ్రీనివాస్ పట్టుబడిన నగదుకు సంబంధించిన ఆధారాలను పోలీస్ స్టేషన్‌లో అందజేయడంతో ఉన్నతాధికారుల ఆదేశానుసారం నగదును శ్రీనివాస్‌కు తిరిగి అందజేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మెడికోల సందడి

నల్లగొండ మెడికల్ కళాశాలలో మంగళవారం కళాశాల వార్షికోత్సవం సందర్భంగా అద్వితీయ్–23 కార్యక్రమం నిర్వహించారు. మెడికల్ కళాశాల ఆవరణలో విద్యార్థులు ఉల్లాసంగా, ఉత్సాహంగా డ్యాన్సులు, చేస్తూ కేరింతలు కొట్టారు. అనంతరం ర్యాంప్ వాక్ చేశారు.
– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ







రేపు ఉచిత వైద్యశిబిరం

నల్లగొండ టౌన్ : ఆర్థోపెడిక్ దినోత్సవం సందర్భంగా ఎంవీఎన్ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ నెల 12న గురువారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు దేవరకొండ రోడ్డులోని సత్యవతి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఉచిత ఆర్థోపెడిక్ మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ట్రస్టు కార్యనిర్వాహక కార్యదర్శి పి.నర్సిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కుటుంబ సభ్యులకు వృద్ధురాలి అప్పగింత


వృద్ధురాలిని అప్పగిస్తున్న సీఐ

నల్లగొండ క్రైం : దారి తప్పి నల్లగొండ పట్టణానికి వచ్చిన వృద్ధురాలిని మంగళవారం నల్లగొండ టూటౌన్ సీఐ నాగదుర్గ ప్రసాద్ సమక్షంలో కుటుంబ సభ్యులకు అప్పగించారు. వివరాలు.. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా పెద్దకాకాని మండలం నంబూరు గ్రామం విజయభాస్కర కాలనీకి చెందిన కొండేటి మరియమ్మ తన కూతురు వద్దకు వెళ్లి వస్తానని చెప్పి రైలులో బయలుదేరింది. కళ్లు సరిగ్గా కనిపించకపోవడంతోపాటు చెవులు సక్రమంగా వినిపించని కారణంగా దారి తప్పి నల్లగొండ పట్టణానికి వచ్చింది. రామగిరి శివశంకర్ స్వీట్ సెంటర్ వద్ద ఉండగా పారా లీగల్ వలంటీర్ భీమనపల్లి శ్రీకాంత్ ఐసీడీఎస్ అధికారులకు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు విచారించి కుటుంబ సభ్యులైన కొండేటి విజయబాబు, కిశోర్‌లకు వృద్ధురాలిని అప్పగించారు.

సర్వీస్ రోడ్డు నిర్మించాలి

నల్లగొండ టౌన్ : చర్లపల్లిలో అద్దంకి రహదారి వెంట సర్వీస్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దండెంపల్లి సత్తయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం చర్లపల్లిలో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వీసు రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో అద్దంకి నర్సింహ, పిన్నపురెడ్డి మధుసూదన్‌రెడ్డి, కాసర్ల గౌతంరెడ్డి, రాపోలు చంద్రయ్య, ఎండీ సలీం, గౌరీదేవి, మధు, నాగయ్య పాల్గొన్నారు.

మూడు రోజులు నీటి సరఫరా నిలిపివేత

మర్రిగూడ : ఈ నెల 12వ తేదీ నుంచి 14వరకు మండల పరిధిలోని పలు గ్రామాల్లో కృష్ణా జలాల నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌ట్రా ఏఈ వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. నాంపల్లి మండలంలోని లింగోటం వద్ద నీటి శుద్ధి కేంద్రంలో మరమ్మతులు చేపడుతున్న కారణంగా నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టి తాగునీటి సమస్య రాకుండా చూడాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థినులకు గాయాలు

మర్రిగూడ : మండలంలోని దామెరభీమనపల్లి గ్రామానికి చెందిన పలువురు విద్యార్థులు మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం విద్యార్థులు ఉదయం ఆటోలో పాఠశాలకు వెళ్తుండగా మర్రిగూడ చౌరస్తా వద్ద రంగారెడ్డి జిల్లా లోయపల్లి నుంచి వస్తున్న పత్తి కూలీల ఆటో విద్యార్థులు ప్రయాణిస్తున్న ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆదర్శ పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న దామెరభీమనపల్లికి చెందిన నవ్య, శ్రీవాణిలకు గాయాలయ్యాయి. ప్రథమ చికిత్స నిమిత్తం వారిని మర్రిగూడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

15 నుంచి డీటీఎఫ్ రాష్ట్ర మహాసభలు

శాలిగౌరారం : మహబూబ్‌నగర్ పట్టణంలో ఈ నెల 15 నుంచి 17 వరకు జరగనున్న డీటీఎఫ్(డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్) 5వ రాష్ట్ర విద్య, వైజ్ఞానిక రజతోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని డీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బి.వెంకటేశం కోరారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్యారంగంలో వస్తున్న నూతన ధోరణులు, పరిణామాలు, విద్యారంగ వృత్తి సమస్యలు, సామాజిక అంశాలపై జాతీయ స్థాయిలో ప్రావీణ్యం కలిగిన విద్యావేత్తలు ఈ సమావేశంలో విలువైన సందేశం ఇవ్వనున్నారని తెలిపారు. ఆయనవెంట నాగరాజు, సైదులు, యాకూబ్‌అలీ, భూపాల్, నర్సింహాచారి, గోపాల్, యాదగిరి, అంజయ్య, నగేష్‌లు ఉన్నారు.